## క్లుప్తంగా

### మృతుడి కుటుంబానికి వంగా గీత పరామర్శ



గొర్సలో రాజేష్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న వంగా గీత

కొత్తపల్లి: మండలంలోని గొర్స గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వెలిగట్ల శ్రీనివాస్ కుమారుడు రాజేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇంచార్జి వంగా గీత గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, వైస్ ఎంపీపీ సురేష్‌కుమార్, గింజల శ్రీనివాస్, కొప్పిశెట్టి నాగేశ్వరరావు, గొల్లపల్లి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

**కందరాడలో ప్రసాద్‌కు పరామర్శ**

కొత్తపల్లి: పిఠాపురం మండలం కందరాడ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు సైతన వరప్రసాద్ తల్లి సుబ్బలక్ష్మి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇంచార్జి వంగా గీత గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో ఆనాల సుదర్శన్, మాధవరావు తదితరులు ఉన్నారు.

### ఆకట్టుకున్న నాటక ప్రదర్శన



నాటక ప్రదర్శనలో ఓ సన్నివేశం

పెద్దాపురం: మండలంలోని చదలాడ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి ఉత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ప్రదర్శించిన ఆ రోజు కోసం.. నాటక ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. చంద్రమాంపల్లి స్నేహ ఆర్ట్స్ బృందం ప్రదర్శించిన తీరు చూపరులను మైమరపించింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## సినిమాలు




| | |
|---|---|
| **పెద్దాపురం** | |
| లలితా-1: | పుష్ప-2 |
| లలితా-2: | పుష్ప-2 |
| వీరభద్ర: | సీ202 |
| శోభా: | పుష్ప-2 |
| **సామర్లకోట** | |
| జయలక్ష్మి-1: | పుష్ప-2 |
| జయలక్ష్మి-2: | పుష్ప-2 |
| విఘ్నేశ్వరా: | పుష్ప-2 |

# నిర్లక్ష్యం.. ఓవర్‌గా లేదు!

- ఫ్లైఓవర్ బ్రిడ్జిపై కానరాని శ్రద్ధ
- ప్రమాదాలకు కారణమవుతున్న రెయిలింగ్
- వంతెనపై అడుగడుగునా గోతులు
- తరుచూ ట్రాఫిక్‌కు అంతరాయం



సామర్లకోట ఫ్లైఓవర్ బ్రిడ్జి కూడలిలో కూలిన రెయిలింగ్‌కు ఏర్పాటు చేసిన రిబ్బన్లు



ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఏర్పడిన గోతులు

సామర్లకోట: ఏడీబీ రోడ్డులో ప్రతిష్ఠాత్మకమైన సామర్లకోట ఫ్లైఓవర్ బ్రిడ్జి కూడలి ప్రమాదాలకు నిలయంగా మారింది. రాజమహేంద్రవరం నుంచి ఏడీబీ రోడ్డులో సామర్లకోట ఫ్లైఓవర్ బ్రిడ్జిపై రెయిలింగ్ శిథిలమై ఎనిమిది నెలలు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. దాంతో అదుపు లేని భారీ వాహనాల రాకపోకలతో, చిన్న వాహనాల చోదకులు ప్రమాదం అంచున ప్రయాణాలు సాగిస్తున్నారు. దీనికితోడు నిత్యం వందలాది మంది కాలినడకన ఫుట్‌పాత్ మీదుగా నడిచి వెళుతుంటారు. కొంత మంది రెయిలింగ్‌ను పట్టుకుని నడక సాగిస్తుంటారు. ఇటువంటి సమయంలో.. కూలిన రెయిలింగ్‌ను గమనించకపోతే సుమారు 20 అడుగుల ఎత్తు నుంచి కింద పడే అవకాశాలు లేకపోలేదు. ఆర్‌అండ్‌బీ అధికారులు కూలిన రెయిలింగ్‌ను పటిష్టపర్చకపోవడంపై అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు కూలిన రెయిలింగ్ వద్ద కేవలం రిబ్బన్లు కట్టి చేతులు దులుపుకొన్నారు.



స్టేషన్ సెంటర్ నుంచి వచ్చే మార్గంలో కూడలి వద్ద కూలిన రెయిలింగ్

పెద్దాపురం ఏడీబీ రోడ్డు నుంచి బ్రిడ్జి ఎక్కే మార్గంలో సత్యనారాయణపురంలో ఉన్న కల్యాణ మండపం ఎదురుగాను, బ్రిడ్జి కూడలి ప్రదేశంలో రెండు ప్రదేశాల్లోను రెయిలింగ్ కూలింది. అదేవిధంగా బ్రిడ్జి నుంచి బస్సు కాంప్లెక్స్‌కు వచ్చే మార్గంలో బార్ ఎదురుగా రెయిలింగ్ శిథిలమై ప్రమాదకరంగా మారాయి.

**అడుగడుగునా గోతులు**

ఫ్లైఓవర్ బ్రిడ్జి అడుగడుగునా గోతులతో నిండిపోవడంతో చిన్న వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం, సాయంత్రం సమయంలో వివిధ కార్పొరేట్ కళాశాలలకు చెందిన బస్సులు ఒకేసారి రావడంతో, బ్రిడ్జిపై ఉన్న గోతుల కారణంగా వాహనాలు నెమ్మదిగా వెళ్లడంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. గోతులను తప్పించుకునే క్రమంలో భారీ వాహనాలు ఎడమ వైపు నుంచి కుడి వైపు వస్తున్నాయి. దాంతో ఎదురుగా వచ్చే వాహనాలతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. బ్రిడ్జి దిగువ భాగంలో గోతులు పూడ్చిన ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఉన్న గోతులు కనిపించడం లేదా అనే విమర్శలు ఉన్నాయి.

### రెయిలింగ్‌ను నిర్మించాలి



సామర్లకోట ఫ్లైఓవర్ బ్రిడ్జి నిత్యం రద్దీగా ఉంటుంది. దాంతో భారీ వాహనాల రాకపోకల సమయంలో కూలిపోయిన రెయిలింగ్ వద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు వెంటనే రెయిలింగ్ నిర్మాణం పూర్తి చేసి ప్రమాదాలు నివారించాలి. రెయిలింగ్ నిర్మాణం చేసే వరకు కూలిన ప్రదేశంలో రోడ్డు డివైడర్ బోర్డులు ఏర్పాటు చేయాలి. బ్రిడ్జి గోడలలో రావి చెట్లు పెరిగిపోతున్నాయి. దాని కారణంగా బ్రిడ్జి గోడ బలహీన పడే ప్రమాదం ఉంది. బ్రిడ్జి కూడలి ప్రదేశాలలో గోతుల కారణంగా తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది.

– కాళ్ల లక్ష్మీనారాయణ, మాజీ కౌన్సిలర్, సామర్లకోట

### మెయింటెనెన్స్‌కు నిధుల కొరత



గతంలో ప్రతి ఏడాది ఆర్‌అండ్‌బీకి మెయింటెనెన్స్ నిధులు విడుదల చేసేవారు. అయితే నిధుల కొరత కారణంగా పనులు చేయలేని పరిస్థితి. దాంతో కూలిన రెయిలింగ్ పనులతో పాటు, బ్రిడ్జి గోడలలో పెరిగిన మొక్కలను తొలగించలేని పరిస్థితి ఉంది. గోతులు పూడ్చడానికి వచ్చిన నిధులు వాటికే సరిపోతున్నాయి. ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ప్రమాదకరంగా ఉన్న రెయిలింగ్‌ను గమనించాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి కూలిన రెయిలింగ్ వద్ద మరమ్మతులు చేస్తాం.

– పి.ఫణేశ్వరరావు, జేఈ, ఆర్‌అండ్‌బీ, సామర్లకోట

### నేరాల అదుపునకు సీసీ కెమెరాలు



సామర్లకోట స్టేషన్ సెంటర్‌లో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరా టవర్

సామర్లకోట: పట్టణంలో నేరాలు అదుపు చేయడానికి పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఆదేశాలు, సీఐ ఎ.కృష్ణభగవాన్ పర్యవేక్షణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్టు ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు తెలిపారు. పోలీసు రింగ్ సెంటర్, రైల్వే స్టేషన్ సెంటర్‌లో ప్రస్తుతం సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ మేరకు రైల్వే స్టేషన్ సెంటర్‌లో సీసీ కెమెరాలకు సంబంధించిన టవర్ ఏర్పాటు చేశారు. నిత్యం రద్దీగా ఉండే స్టేషన్ సెంటర్‌లో నేరాలు అదుపు చేయడంతో పాటు, ప్రయాణికుల భద్రతకు ఈ సీసీ కెమెరాలు దోహదపడతాయని చెప్పారు. స్టేషన్ సెంటర్‌లో ఉన్న ప్రతి షాపు యజమాని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఇప్పటికే సూచించినట్టుతెలిపారు.

## దుర్గాడలో షష్ఠి ఉత్సవాలు ప్రారంభం



దుర్గాడలో కలశాలతో గామోత్సవం చేస్తున్న భక్తులు

కొత్తపల్లి: గొల్లప్రోలు మండలం దుర్గాడలో వేంచేసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద షష్ఠి మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభించారు. తొలుత మహిళలు 108 కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. పండితులు రాత్రికి వేద మంత్రాలు, భాజాభజంత్రీల నడుమ స్వామివారి వార్షిక కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు కల్యాణాన్ని తిలకించి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## నేలతల్లి రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ హరి

పెద్దాపురం: ప్రతి రైతుపై నేలతల్లిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉంటుందని పెద్దాపురం రైతు శిక్షణా కేంద్రం ఏడీఏ బీవీఎస్‌సీ హరి అన్నారు. ప్రపంచ నేల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండలంలోని కట్టమూరు రైతు భరోసా కేంద్రంలో ఏఓ సంజయ్‌కుమార్ అధ్యక్షతన నేల దినోత్సవ రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ హరి మాట్లాడుతూ, రైతులకు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వ్యవసాయాభివృద్ధి సాధించేందుకు గాను ఆర్‌బీకేల ద్వారా నేరుగా అవగాహన కల్పిస్తున్నట్టు వివరించారు. దేశంలో మన రాష్ట్రంలోనే అత్యధికంగా భూసార పరీక్షలు నిర్వహించి, రైతులకు భూసార పత్రాలు అందజేసినట్టు చెప్పారు. నేలతల్లిని కాపాడేందుకే ప్రభుత్వం వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. భూసార పరీక్షలు నిర్వహించినప్పుడు, భూమిలో సూక్ష్మ లోపం ఉంటే.. ప్రభుత్వం వారికి సబ్సిడీపై జిప్సమ్, బోరాన్, జింకు సరఫరా చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీసీ ఏఓ దవులూరి సంజీవ్, ఏఈఓ బి.రాగ స్రవంతి, ఉద్యాన, వ్యవసాయ సహాయకులు అమృత, విజయదుర్గ, పలువురు రైతులు పాల్గొన్నారు.

## ముగిసిన రైల్వే సంఘ ఎన్నికల పోలింగ్



పోలింగ్ అధికారి సమక్షంలో పోలింగ్ బాక్సు సీల్‌ను పరిశీలిస్తున్న ఆర్‌పీఎఫ్ ఎస్సై

సామర్లకోట: రైల్వే యూనియన్ ఎన్నికలకు సంబంధించి రెండు రోజుల పాటు జరిగిన పోలింగ్ గురువారం సాయంత్రం ముగిసింది. రైల్వేలో గుర్తింపు కోసం డీఎంఆర్‌కేఎస్, ఐఆర్‌ఎంయూ, ఆర్‌ఎంయూ, ఎస్‌సీఆర్‌ఈఎస్, ఎస్‌సీఆర్‌ఎంయూ యూనియన్ల ప్రతినిధులు పోటీ చేస్తున్నారు. అయితే రైల్వే ఎంప్లాయీస్ యూనియన్, రైల్వే మజ్దూర్ యూనియన్ మధ్య ప్రధాన పోరు జరుగుతోంది. ఎంప్లాయీస్ యూనియన్‌కు రైలింజన్ గుర్తు, మజ్దూర్ యూనియన్‌కు జెండా గుర్తును కేటాయించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు బుధ, గురువారాల్లో పోలింగ్ నిర్వహించారు. సామర్లకోట బ్రాంచి యూనియన్‌కు సంబంధించి పట్టణంలో ఒకటి, పిఠాపురంలో మరొక పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశారు. కేశవరం నుంచి హంసవరం వరకు ఉన్న రైల్వే ఉద్యోగులు పోలింగ్‌లో పాల్గొన్నారు. సామర్లకోటలో 483 ఓట్లకు గాను 430 ఓట్లు పోలయ్యాయి. అదేవిధంగా పిఠాపురం పోలింగ్ బూత్‌లో 264 ఓట్లుకు 232 ఓట్లు పడ్డాయని రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం రమేష్ విలేకర్లకు తెలిపారు. రెండు పోలింగ్ బూత్‌లలో 747 ఓట్లకు 662 ఓట్లతో 89 శాతం పోలింగ్ జరిగింది. రెండు రోజులూ ఆర్‌పీఎఫ్ ఎస్సై ఎస్ రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. రైల్వే ఉద్యోగుల గుర్తింపు కార్డు, బూత్ స్లిప్‌లున్న వారిని మాత్రమే పోలింగ్ కేంద్రంలోకి అనుమతించారు. లోకో పైలట్ల ఉద్యోగుల కోసం 6వ తేదీన రాజమహేంద్రవరం, విజయవాడలలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంది. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఎన్నికలకు సంబంధించి ఈ నెల 12న కౌంటింగ్ జరుగుతుందని రమేష్ తెలిపారు. ఎన్నికల అధికారి డి.ప్రసాద్(రాజమహేంద్రవరం, ఏడీఈఈఎస్) పర్యవేక్షణలో ఆర్‌పీఎఫ్ బందోబస్తు మధ్య పోలింగ్ బాక్సులకు సీల్ వేసి, విజయవాడకు తరలించారు.

## బీచ్ రోడ్డులో మత్స్యకారుల ఆందోళన



ఆందోళన చేస్తున్న మత్స్యకారులతో చర్చిస్తున్న ఆర్డీవో మల్లిబాబు, మాజీ ఎమ్మెల్యే వర్మ

కొత్తపల్లి: తీర ప్రాంతంలో కాలుష్య పరిశ్రమలు ఏర్పాటు చేయడం వలన మత్స్యకారుల జీవనోపాధికి ముప్పు వాటిల్లుతోందని మత్స్యకార సంఘం నాయకులు అన్నారు. తీర ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు వ్యతిరేకంగా గురువారం మండలంలోని పొన్నాడ శివారు కోనపాపపేటలో బీచ్ రోడ్డులో మత్స్యకారులు ఆందోళన నిర్వహించారు. బోటును రోడ్డుకు అడ్డంగా పెట్టి నిరసన తెలిపారు. పరిశ్రమ నుంచి వ్యర్థాలను పైపులైన్‌ల ద్వారా సముద్రంలోకి విడుదల చేయడం వలన మత్స్య సంపద అంతరించిపోతుందన్నారు. తీరంలో జీవిస్తున్న తాము అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని భయాందోళనలు వ్యక్తం చేశారు. తీరంలో ప్రతి మత్స్యకార కుటుంబానికి నెలకు రూ.20 వేలు ఇవ్వాలని, కుటుంబాల్లో చదువుకున్న వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆందోళన కారులతో ఆర్డీవో మల్లిబాబు, మాజీ ఎమ్మెల్యే వర్మ చర్చించారు. ఈ నెల 20న కాకినాడలో పరిశ్రమ యాజమాన్యం, మత్స్యకారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహిస్తారని హామీ ఇవ్వడంతో మత్స్యకారులు ఆందోళనను విరమించారు.

## 'వాటర్ స్పోర్ట్స్' అభివృద్ధికి ప్రయత్నాలు



కలెక్టర్‌ను కలిసిన వాటర్ స్పోర్ట్సు ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు

కాకినాడ సిటీ: నగరంలోని ఎన్టీఆర్ బీచ్‌లో వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధికి ప్రయత్నాలు సాగుతున్నాయి. ఇందులో భాగంగా వాటర్ స్పోర్ట్సు ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ ప్రతాప్‌నాయుడు, రాష్ట్ర వాటర్ స్పోర్ట్స్ అధ్యక్షుడు బలరామనాయుడు, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి బి శ్రీనివాసరావులు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌ను కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు.

### మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

కాకినాడ రూరల్: అక్రమంగా మద్యం సీసాలు కలిగి ఉన్న సామర్లకోట మండలం పి.వేమవం గ్రామానికి చెందిన వ్యక్తి శ్రీపతి సోమరాజును గురువారం అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ నార్త్ స్టేషన్ సీఐ రామ్మోహనరావు తెలిపారు. నిందితుడు నుంచి 180 ఎంఎల్ మద్యం 24 సీసాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. దాడిలో ఎస్సై కుమార్, సిబ్బంది పాల్గొన్నట్టు తెలిపారు.

### సామర్లకోట మీదుగా విజయవాడ వైపు వెళ్లు రైళ్లు

| రైలు నెంబరు | ఎక్కడ నుంచి ఎక్కడకు | సర్వీసు | రాక | పోక |
|---|---|---|---|---|
| 20805 | విశాఖపట్నం - న్యూఢిల్లీ | ప్రతిరోజు | 00-08 | 00-10 |
| 12703 | హౌరా - సికింద్రాబాద్ | ప్రతి రోజు | 00-44 | 00-45 |
| 11020 | భువనేశ్వర్-బెంగళూరు | ప్రతిరోజు | 00-54 | 00-55 |
| 17220 | విశాఖపట్నం-మచిలీపట్నం | ప్రతిరోజు | 01-04 | 01-05 |
| 12552 | కామాఖ్య - బెంగళూరు | శుక్ర | 01-08 | 01-10 |
| 22883 | పూరి - బెంగళూరు | శని | 01-23 | 01-25 |
| 22707 | విశాఖపట్నం-తిరుపతి | మంగళ, శుక్ర, ఆది | 01-23 | 01-25 |
| 18519 | విశాఖ-లోకమాన్యతిలక్ | ప్రతి రోజు | 01-43 | 01-45 |
| 22859 | పూరి - చెన్నై సెంట్రల్ | సోమ | 03-13 | 03-15 |
| 22825 | షాలిమార్-చెన్నై సెంట్రల్ | బుధ | 03-44 | 03-35 |
| 17258 | కాకినాడ-విజయవాడ | ప్రతి రోజు | 04-33 | 04-35 |
| 12755 | కాకినాడ-భావనగర్ | గురు | 05-53 | 05-55 |
| 17481 | బిలాస్‌పూర్-తిరుపతి | బుధ,ఆది | 05-49 | 05-50 |
| 17479 | పూరి - తిరుపతి | బుధ, ఆది | 05-49 | 05-50 |
| 22851 | సంత్రాగచ్చి-మంగుళూరు | శుక్ర | 06-13 | 06-15 |
| 18045 | షాలిమార్-హైదరాబాద్ | ప్రతి రోజు | 06-33 | 06-35 |
| 17206 | కాకినాడ-సాయినగర్‌షిర్డి | సోమ, బుధ, శని | 06-24 | 06-25 |
| 22701 | విశాఖపట్నం-విజయవాడ | గురు, ఆది | 07-48 | 07-50 |
| 12773 | షాలిమార్-సికింద్రాబాద్ | గురు | 08-03 | 08-05 |
| 12805 | విశాఖ-లింగంపల్లి | ప్రతి రోజు | 08-44 | 08-45 |
| 17221 | కాకినాడ-లోకమాన్యతిలక్ | బుధ, శని | 09-23 | 09-25 |
| 17240 | విశాఖ-గుంటూరు | ప్రతీ రోజు | 09-59 | 10-00 |
| 22807 | సంత్రగాచి-చెన్నై | బుధ, శని | 09-43 | 09-45 |
| 22841 | సంత్రాగచ్చి-తాంబరం | మంగళ | 09-44 | 09-45 |
| 18567 | విశాఖ-కొల్లాం | గురు | 09-44 | 09-45 |
| 12803 | విశాఖ-నిజాముద్దీన్ | సోమ,శుక్ర | 10-18 | 10-20 |
| 18503 | విశాఖ-సాయినగర్ | గురు | 10-38 | 10=40 |
| 12835 | హటియా-బెంగుళూరు | మంగళ,బుధ | 11-03 | 11-05 |
| 12376 | జసిదీహ్-తాంబరం | గురు | 11-04 | 11-05 |
| 18637 | హటియా-బెంగళూరు | ఆది | 11-04 | 11-05 |
| 22837 | హటియ-ఎర్నాకులం | మంగళ | 11-04 | 11-05 |

## ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్



పిఠాపురంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు హర్షవర్ధన్



సామర్లకోటలో ఓటు హక్కు వినియోగించుకున్న ఉపాధ్యాయులు

సామర్లకోట: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా జరిగింది. హైస్కూళ్ల హెచ్‌ఎంలతో పాటు,, హైస్కూళ్లలో మూడేళ్ల పాటు ఉపాధ్యాయులుగా పని చేసిన వారికి ఓటు హక్కు లభించింది. దాంతో మండలంలో 178 మంది ఉపాధ్యాయ ఓట్లు ఉండగా, 162 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా పెద్దాపురం మండలంలో 156 మంది ఉపాధ్యాయ ఓటర్లకు గాను 141 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. సామర్లకోట, పెద్దాపురం ఎంపీడీఓ కార్యాలయాలలో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఎన్నికల పోలింగ్ కేంద్రమైన ఎంపీడీఓ కార్యాలయం వద్ద పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఆధ్వర్యంలో సీఐ ఎ.కృష్ణభగవాన్ బందోబస్తు నిర్వహించారు. అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

**ప్రశాంతంగా పోలింగ్**

కొత్తపల్లి: ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ పిఠాపురం నియోజకవర్గంలో గురువారం ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గంలో 350 మంది ఓటర్లకు గాను 325 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. కొత్తపల్లి 85 ఓట్లకు గాను 80, గొల్లప్రోలు 65 ఓట్లకు గాను 62, పిఠాపురం 200 ఓట్లకు గాను 183 ఓట్లు పోలైనట్టు అధికారులు తెలిపారు. పిఠాపురం పోలింగ్ కేంద్రాన్ని ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు కె.హర్షవర్ధన్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



పెద్దాపురంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ భాస్కరరావు

### డివిజన్‌లో పోలింగ్ ప్రశాంతం

- మొత్తం 92.21 శాతం పోలింగ్
- ఆర్డీఓ శ్రీరమణి వెల్లడి



పెద్దాపురంలో ఓటు వేస్తున్న ఉపాధ్యాయులు



పెద్దాపురంలో పోలింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. పెద్దాపురం డివిజన్ పరిధిలో ఆర్డీఓ శ్రీరమణి 11 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిని పరిశీలించారు. మొత్తం 92.21 శాతం పోలింగ్ జరిగింది. డివిజన్‌లో అత్యధికంగా రౌతులపూడి మండలంలో 97.67, అత్యల్పంగా గండేపల్లి మండలంలో 87.50 శాతం పోలింగ్ నమోదైనట్లు ఆర్డీఓ తెలిపారు. డివిజన్ పరిధిలో నాలుగు నియోజకవర్గాలకు గాను 11 మండలాల పరిధిలో 899 మంది ఓటర్లు ఉండగా, 829 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్టు చెప్పారు.